సాక్షి సంగారెడ్డి

బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



గుప్పుమంటున్న గంజాయి

గంజాయి దందా జోరుగా సాగుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి నేరుగా దూల్మిట్ట మండలంలోని కొండాపూర్ గ్రామంలో గంజాయి డంప్ చేస్తున్నారని సమాచారం. వివరాలు 8లో ▸



యువర్ అటెన్షన్ ప్లీజ్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల అధికారులు ఓటు నమోదు చేసుకునేందుకు మరో అవకాశం కల్పించారు. 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలు 8లో ▸

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్టీసీ డిపోలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం మల్లేశయ్య తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు 99592 23170 నంబరుకు ఫోన్‌చేసి ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించాలన్నారు.







తలకు పెట్టుకోవాలనే తలంపు ఏది?

ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించినా చాలామంది నిర్లక్ష్యపు ప్రయాణం చేస్తూనే ఉన్నారు. చలాన్ల భయానికి హెల్మెట్‌ను వెంట తెచ్చుకుంటున్నారే తప్ప ప్రాణ రక్షణకు వాడాలనే తలంపు ఏ ఒక్కరిలోనూ కనిపించడం లేదు. కొందరు హెల్మెట్‌ను పెట్రోల్ ట్యాంక్‌పై పెట్టుకుంటుండగా.. మరికొందరు మిర్రర్‌కి తగిలించుకుంటున్నారు. పోలీసులు కనిపిస్తే తలకు పెట్టుకుందాంలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

అంగన్‌వాడీల్లో సేవలు భేష్



చిన్నారులతో హెల్సెంకి యూనివర్సిటీ బృందం

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని చెర్ల గోపులారంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఫిన్‌లాండ్ దేశంలోని హెల్సింకి యూనివర్సిటీ బృందం సందర్శించింది. అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. చిన్నారులు, బాలింతలకు ఎలాంటి పోషక ఆహారం అందిస్తున్నారో టీచర్ అనసూయను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సేవలను వారు అభినందించారు.

పిల్లలకు సమయానికి భోజనం అందించండి



మాట్లాడుతున్న హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: పిల్లలకు సమయానికి భోజనం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలసదనంను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సదనం పరిసరాలు, వంట గదిని పరిశీలించారు. పిల్లలతో బాగా చదివేలా చూడాలన్నారు. ఏదైనా న్యాయ సహాయం కావాలంటే న్యాయ సేవాధికారిని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో బాల సదనం పర్యవేక్షకురాలు విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

నెలలోపే పింఛన్ పత్రాలు



పింఛన్ పత్రాలు అందజేస్తున్న విశాల్ అగ్రవాల్

పటాన్‌చెరు టౌన్: పదవీ విరమణ పొందిన నెలలోనే చందాదారులకు పింఛన్ పత్రాలు మంజూరు చేస్తున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ అన్నారు. మంగళవారం ప్రయాస పథకంలో భాగంగా మండల పరిధి రుద్రారం గీతం యూనివర్సిటీలో నిర్వహించిన నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమంలో ఫిబ్రవరిలో 14 మందికి పింఛన్ మంజూరు చేయగా, అందులో ఆరుగురికి మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అకౌంట్స్ అధికారి మనోజ్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పెద్దిరాజు, గీతం యూనివర్సిటీ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు



ఇసోజిపేటలో డంపు యార్డును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

పుల్‌కల్(అందోల్): వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ అనిత పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం ఎంపీపీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. మిషన్ భగీరథ పథకం తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. నర్సరీలో మొక్కలను సంరక్షించాలని చెప్పారు. అలాగే మొక్కలు నాటడానికి అనువైన స్థలాలను గుర్తించాలని తెలిపారు. అంతకుముందు ఇసోజిపేట గ్రామపంచాయతీలో ఎంపీ ఓ శ్రీకాంత్ గౌడ్‌తో కలిసి రికార్డులను పరిశీలించారు. అలాగే డంపుయార్డు, నర్సరీని పరిశీలించారు.

న్యూస్‌రీల్

అలరించిన కుస్తీ పోటీలు



అయూబ్‌కు వెండి కడియాన్ని బహూకరిస్తున్న గ్రామస్తులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని డప్పూర్ గ్రామ శివారులో గల హజ్రత్ పీర్ గైబ్ సాహెబ్ ఖిబ్లా రెహమతుల్లా అలై జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల మల్లయోధులు పాల్గొన్నారు. కర్నాటక రాష్ట్రంలోని గడికుస్నూర్‌కు చెందిన అయూబ్ విజేతగా నిలిచాడు. అతనికి 11 తులాల వెండి కడియంతో పాటు నగదును డప్పూర్ గ్రామ పెద్దలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, మాజీ సర్పంచ్ రవికుమార్, జమీరొద్దీన్, హైమాద్ పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



సుధారాణిని సన్మానిస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కాట సుధారాణి అన్నారు. మంగళవారం మండల పరిధి క్యాసారం గ్రామంలో జరిగిన రేణుకా ఎల్లమ్మ జాతరలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆమెను సన్మానించారు.

జల సంరక్షణపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

సంగారెడ్డి టౌన్: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో రైతులకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నరసింహారావు సూచించారు. మంగళవారం పోతిరెడ్డిపల్లిలోని రైతువేదికలో రెండు రోజుల పాటు నిర్వహించిన నీటి సంరక్షణ యాజమాన్యంపై శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం ఏఈఓలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వాలంటరీ డైరెక్టర్ నాగేందర్, ఈఈ జ్ఞానేశ్వర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వీరభద్రేశ్వర ఆలయంలో డీఎస్పీ పూజలు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర ఆలయంలో జహీరాబాద్ డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రామ్మోహన్ రెడ్డి రూరల్ సీఐ నవీన్‌కుమార్‌తో కలిసి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. పురోహితులు ఆశీర్వచనాలు అందించారు. తీర్థప్రసాదాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక ఏఎస్ఐ ఇక్బాల్ హుస్సేన్, కానిస్టేబుల్ వీరప్ప, కృష్ణ ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 14 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 14 మందికి జరిమానా విధించినట్లు పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 14 మందిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పరిచారు. వారికి జడ్జి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమానా విధించారు.

3 నెలలుగా జీతాల్లేవ్



మునిపల్లి(అందోల్): జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లు వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. మూడు నెలలుగా జీతాలు రాక కుటుంబ పోషణ భారమై ఇబ్బంది పడుతున్నారు. నెలనెలా జీతం వస్తేనే ఇల్లు గడిచేది కష్టంగా ఉంటున్న ఈ రోజుల్లో 2023 డిసెంబర్ నుంచి వేతనాలు రాకపోతే ఎలా అని గెస్ట్ లెక్చరర్లు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గెస్ట్ లెక్చరర్లకు రూ. 28 వేల 80 రూపాయల నుంచి రూ.42 వేలకు జీతం పెంచుతామని మేనిఫెస్టోలో పేర్కొంది. జీతం పెరుగుడు దేవుడెరుగు.. నెలనెలా జీతం ఇస్తే చాలన్నట్లుగా ఉంది గెస్ట్ లెక్చరర్ల పరిస్థితి.

విధుల్లో 105 మంది గెస్ట్ లెక్చరర్లు

జిల్లాలోని 20 ప్రభుత్వ కళాశాలల్లో 105 మంది గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారు. 2017 సంవత్సరంలో ప్రారంభ జీతం నెలకు రూ. 10 వేల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసేది. 2018లో రూ. 10 వేల నుంచి రూ. 21వేలకు పెంచింది. తిరిగి 2020–2021 సంవత్సరంలో 28 వేల 80 రూపాయల చొప్పున అప్పటి ప్రభుత్వం వేతనం పెంచింది. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే గెస్ట్ లెక్చరర్లకు సుమారు 42 వేల రూపాయల వరకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చింది. కానీ ఇప్పటివరకు దానికి గురించి ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు.

గుర్తింపు ఏది?

2023 ఫిబ్రవరి బడ్జెట్‌లో గెస్ట్ లెక్చరర్లకు 12 నెలల వేతనం మంజూరు చేయాలని అప్పటి ముఖ్యమంత్రి ఆదేశించినా ఫలితం లేకుండా పోయింది. జూన్, జూలై కాకుండా ఆగస్టు నుంచి విధులకు తీసుకోవడంతో 7–8 నెలలకు వేతనం మాత్రమే మంజూరు చేస్తున్నారు. అవి కూడా 3 నెలలకోసారి ఇస్తున్నారు. రెగ్యూలర్, కాంట్రాక్టు లెక్చరర్లతో సమానంగా ఎనిమిదేళ్లుగా పని చేస్తున్నా ప్రభుత్వం గెస్ట్ లెక్చరర్లను గుర్తించడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన డిమాండ్లు

హైకోర్టు జీఓ నంబర్ 28131, 2023 ఉత్తర్వుల ప్రకారం ఎంటీఎస్ (మినిమం టైం స్కేల్) ద్వారా ఉద్యోగ భద్రత కల్పించాలని గెస్ట్ లెక్చరర్లు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. అలాగే 72 పీరియడ్స్‌ను రద్దు చేసి 12 నెలల వేతనం మంజూరు చేయాలంటున్నారు. త్రిమెన్ కమిటీ ద్వారా 105 మందిని రెగ్యులర్ చేయాలని కోరుతున్నారు.

హైకోర్టు తీర్పుతో..

గెస్ట్ లెక్చరర్లకు ఆటో రెన్యూవల్ చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ 2023–2024 విద్యా సంవత్సరంలో ఇంటర్ బోర్డు కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో గెస్ట్ లెక్చరర్లు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన ధర్మాసనం కొత్త నోటిఫికేషన్ చెల్లదని, పాత వారినే కొనసాగించాలని, ఆటో రెన్యూవల్ చేయాలని తీర్పునిచ్చింది. ప్రభుత్వం కోర్టు అదేశాలను అమలు చేయకపోవడంతో ఆ సమయంలో గెస్ట్ లెక్చరర్లు ఆందోళన చేపట్టారు. దీంతో పాత వారినే విధుల్లోకి తీసుకున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వమైనా...

ప్రతీ సంవత్సరం జూన్ 1వ తేదీ నుంచి మరుసటి ఏడాది మార్చి 31వ తేదీ వరకు గెస్ట్ లెక్చరర్లు విధులు నిర్వర్తించాల్సి ఉండగా, అందుకనుగుణంగా గత ఆర్థిక సంవత్సరంలో గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. తమ వేతనాలపై ఇంటర్ బోర్డు పట్టింపులేనట్లుగా వ్యవహరిస్తుందని గెస్ట్ లెక్చరర్లు ఆరోపిస్తున్నారు. విద్యాసంవత్సరం ముగుస్తున్నా జీతాలు ఇవ్వడం లేదని వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా మా సమస్యలను పట్టించుకోవాలని కోరుతున్నారు. ఇటీవల ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి సమస్యలు పరిష్కరించాలని గెస్ట్ లెక్చరర్లు కోరారు. ఇందుకు మంత్రి సానుకులంగా స్పందించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రతతో పాటు 12 నెలల వేతనం మంజూరు చేసి ఆదుకోవాలి. ప్రతి నెలా సక్రమంగా వేతనం మంజూరు చేయాలి. ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించిన సౌకర్యాలు మాకూ కల్పించాలి. – సాయిబాబా, గెస్ట్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

బాల్య వివాహాలు అరికట్టాలి

కలెక్టర్ క్రాంతి



పుస్తకాలు ఆవిష్కరించిన కలెక్టర్

సంగారెడ్డి టౌన్: బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో యూనిసెఫ్ ఢిల్లీ శాఖ ఆధ్వర్యంలో బడి మానేసిన కిషోర బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, బాల్య వివాహాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన ఆరు పుస్తకాలను కలెక్టర్ విడుదల చేశారు. వీటిని ప్రతి గ్రామానికి ఒకటి చొప్పున ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యూనిసెఫ్ ఢిల్లీ జై రుషి లింగో, జలీబి తాప్సీ, రాష్ట్ర బృందం సభ్యులు మురళి, దావిద్, జిల్లా మహిళా సంక్షేమ అధికారి లలిత కుమారి, సీడబ్ల్యూసీ వెంకటేశం సీడీపీఓ రేణుక. డీసీపీఓ రత్నం, లింగం తదితరులు పాల్గొన్నారు.

చక్రియాల్‌లో జపాన్ శాస్త్రవేత్తల పర్యటన



రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

సంగారెడ్డి: ఐఐటీ కంది వారి సౌజన్యంతో జపాన్ శాస్త్రవేత్తలు మంగళవారం చక్రియాల్ గ్రామాన్ని సందర్శించారు. అక్కడ పంటల సస్యరక్షణ చర్యల గురించి తెలుసుకున్నారు. సాగు ఇబ్బందులు, పంట కొనుగోళ్లు తదితర అంశాలపై ఆరా తీశారు. సైంటిస్టులు రామ, ఊకి, అకిరా, వ్యవసాయ అధికారి చైతన్య, ఏఈఓ మనీషా పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆలయ బ్రహ్మోత్సవాలు



భజనలు చేస్తున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. టీటీడీ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉదయం ధ్వజారోహణం గావించిన అనంతరం స్వామివారికి 108 కలశాలతో అభిషేకం, హోమం నిర్వహించి శ్రీమూర్తులకు గరుడ ప్రసాదం అందజేశారు.

చెరకు రైతులకు బకాయిల విడుదల

- దిగొచ్చిన ట్రైడెంట్ యాజమాన్యం
- రూ.5 కోట్లు ఖాతాల్లో జమ
- మిగతా రూ.2.38 కోట్లు వారం రోజుల్లో చెల్లించేందుకు హామీ

జహీరాబాద్: ఎట్టకేలకు చెరకు రైతులకు చెల్లించాల్సిన బకాయిలను ట్రైడెంట్ యాజమాన్యం చెల్లింపులు చేసింది. మంగళవారం రాత్రి 7.30 గంటల ప్రాంతాల్లో రైతుల ఖాతాల్లో జమ చేసింది. రూ.5కోట్ల మేర బిల్లులను విడుదల చేసింది. మిగతా రూ.2.38 కోట్లు మరో వారం రోజుల్లో చెల్లించేందుకు హామీ ఇచ్చినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. 2022–23 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి రూ.7.38 కోట్లు ట్రైడెంట్ యాజమాన్యం రైతులకు చెరకు బిల్లులు బకాయి పడింది. వీటిని చెల్లించే విషయంలో జాప్యం చేస్తూ వచ్చింది. దీంతో ప్రభుత్వం, అధికారులు కర్మాగారం ఆస్తులను జప్తు చేసి రైతుల బకాయిలను ఇప్పించేందుకుగాను కార్యాచరణ చేపట్టింది. ఇందుకు గాను చట్టపరంగా ముందుకు సాగింది. రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం యాజమాన్యానికి నోటీసులు జారీ చేసింది. అయినా యాజమాన్యం స్పందించక పోవడంతో ఈనెల 28వ తేదీన ఆస్తులను జప్తుచేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. కర్మాగారానికి సంబంధించిన 41.07 ఎకరాల భూమి, యంత్రాలను వేలం వేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. దీంతో యాజమాన్యం దిగివచ్చి రైతులకు ఇవ్వాల్సిన చెరకు బకాయిలను వారి వారి ఖాతాల్లో జమచేసింది. 2023–24 సీజన్‌కు గాను యాజమాన్యం కర్మాగారంలో క్రషింగ్ చేపట్టకుండా మూతపడేసింది. రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని తమ చెరకును రాష్ట్రంలోని పలు కర్మాగారాలకు, పక్క రాష్ట్రాలకు తరలించుకుంటున్నారు.

మొత్తం బకాయిలు చెల్లించాలి

చెరకు రైతులకు రావాల్సిన మొత్తం బకాయిలను చెల్లించాలని రైతు సంఘం నాయకుడు జి.కొండల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి కొంత మంది రైతుల ఖాతాల్లో బకాయిలను వేసిందన్నారు. సోమవారం లోగా మిగతా బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చిందని, మాట నిలబెట్టుకోవాలన్నారు. ఇప్పటి వరకు యాజమాన్యం జాప్యం చేస్తూ వచ్చిందని, ఆస్తుల జప్తును తప్పించుకునేందుకు బకాయిలను విడుదల చేసిందన్నారు. చిన్న, సన్నకారు రైతులకు సంబంధించిన బకాయిలను మాత్రమే విడుదల చేసిందని, పెద్ద రైతుల ఖాతాల్లో మాత్రం ఇంకా డబ్బులు జమచేయలేదన్నారు.



ట్రైడెంట్ చక్కెర కర్మాగారం

మాటలు.. మంటలు

- హుస్నాబాద్‌లో హీటెక్కిన రాజకీయం
- బండి వ్యాఖ్యలను నిరసిస్తూ దిష్టిబొమ్మల దహనం
- ప్రజాహిత యాత్రపై కాంగ్రెస్ నాయకుల రాళ్లదాడి

సాక్షి, సిద్దిపేట: కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల మంటలు చెలరేగుతున్నాయి. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్రలో మంత్రి పొన్నంపై అనుచిత వాఖ్యలు చేశారని కాంగ్రెస్ నాయకులు ఎదురుతిరిగారు. బండి సంజయ్ చేసిన వాఖ్యలను పొన్నం సీరియస్‌గా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం మొదలైంది. రాళ్ల దాడి, బండి సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేసి కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. దీంతో పార్లమెంట్ ఎన్నికలకు ముందే హుస్నాబాద్‌లో రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి.

బండి వ్యాఖ్యలపై ఫైర్

త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజాహిత యాత్రను ఎంపీ బండి సంజయ్ చేపట్టారు. ఈ నెల 26న హుస్నాబాద్ నియోజకవర్గంలో కోహెడ మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వాఖ్యలు, తల్లిపై ఆరోపణలను బండి సంజయ్ చేశారని కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు బండి సంజయ్‌కు సంబంధించిన ఫ్లెక్సీలను చింపివేశారు. అలాగే హుస్నాబాద్ మండలం రామునిపల్లెలో గుర్తుతెలియని వ్యక్తులు రాళ్ల దాడి చేశారు. పోలీసుల భారీ బందోబస్తు నడుమ బండి యాత్ర సాగింది.

పొన్నం వర్సెస్ బండి

మంత్రి పొన్నం ప్రభాకర్ వర్సెస్ బీజేపీ జాతీయ కార్యదర్శి, ఎంపీ సంజయ్‌ల మధ్య మాటల తూటాలు పేలాయి. 'రాముడి పుట్టుక, అక్షింతల గురించి ఎప్పుడూ మాట్లాడలేదు.. జన్మనిచ్చిన తల్లి పై మాట్లాడిన మాటలు ఎంత వరకు సమంజసం సభ్య సమాజాన్ని కోరుతున్నా... ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడు' అని బండి సంజయ్‌ను మంత్రి పొన్నం హెచ్చరించారు. 'తాను పొన్నం తల్లి గురించి కించ పరిచే విధంగా మాట్లాడలేదు.. పొన్నం తల్లికి పాదాభివందనం చేస్తున్నా, కరీంనగర్ నుంచి ఎంపీగా గెలుపొందకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా, మరి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓటమి చెందితే మంత్రి పదవికి పొన్నం రాజీనామా చేస్తారా' అని బండి సంజయ్ సవాల్ విసిరారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలలో బండి విసిరిన సవాల్‌ను పొన్నం స్వీకరిస్తారా అని జిల్లా వ్యాప్తంగా జోరుగా చర్చ మొదలైంది.

దిష్టిబొమ్మల దహనం

జిల్లాలో పలు చోట్ల బండి సంజయ్ దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. బండికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పొన్నం ప్రభాకర్‌కు సంజయ్ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. పోటా పోటీగా విమర్శలు చేసుకున్నారు.



క్లుప్తంగా

కరాటేలో బాలికల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థినులు

కంగ్టి(నారాయణఖేడ్): నర్సాపూర్‌లో ఆదివారం జరిగిన అండర్–14 విభాగం నేషనల్ కుంపూ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో దెగుల్‌వాడీ యూపీఎస్ బాలికలు ప్రతిభ కనబర్చారు. ఆత్మరక్షణ కోసం బాలికలకు తర్ఫీదునిచ్చే పోటీల్లో అపూర్వరెడ్డి గోల్డ్ మెడల్ సాధించగా, సానియా సిల్వర్, అక్షిత, భాగ్యశ్రీ బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. పతకాలు పొందిన వారికి ఎంపీటీసీ సుశీల గోవింద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రమ్మ వెంకట్‌రెడ్డి, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ షేక్మాబేగం రషీద్‌తోపాటు ప్రధానోపాధ్యాయులు శంశొద్దీన్ ఉపాధ్యాయులు తిరుపతి రెడ్డి, నందిని అభినందించారు.

సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

సంగారెడ్డి అర్బన్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో సూచించారు. సైన్స్‌పై ఆసక్తి పెంచే కార్యక్రమాలు జరపాలని, పాఠశాల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు పేరెంట్స్ కమిటీ, స్థానికుల సహకారంతో ప్రోత్సాహకాలు ఇవ్వాలని పేర్కొన్నారు.

చెట్లు నరికించినందుకు కేసు

కొండపాక(గజ్వేల్): దేవుడి మాన్యం భూమిలో అక్రమంగా చెట్లను నరికించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్టు డిప్యూటీ రేంజ్ అధికారి లింగమూర్తి తెలిపారు. మండల పరిధిలోని దుద్దెడ గ్రామంలో ఉన్న వేణుగోపాల స్వామి దేవాలయం పేరిట పలు సర్వే నంబర్లలో 2.26 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని కృష్ణ అనే వ్యక్తికి గ్రామస్తులు కౌలుకు ఇవ్వగా ఎలాంటి అనుమతులు లేకుండా దేవుడి మాన్యం భూమిలో ఉన్న చెట్లను నరికించాడు. విషయాన్ని గ్రామస్తులు ఫారెస్టు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలకిషన్‌తో కలిసి ఎంక్వైరీ చేసి చెట్లను నరికించిన కృష్ణపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనుమానాదస్పద స్థితిలో వ్యక్తి మృతి



మురళీ (ఫైల్)

మేడ్చల్‌రూరల్: అనుమానాదస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నవీన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా వర్గల్ గ్రామానికి చెందిన మోతెకాని మురళీ(36) రెండేళ్ల కిందట మేడ్చల్‌కు వలసొచ్చి చెక్ పోస్ట్ సమీపంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారం కిందట భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో పిల్లలని తీసుకొని భార్య పుట్టింటికి వెళ్లింది. ఒక్కడే ఇంట్లో ఉంటున్న మురళీ నిత్యం మద్యం సేవించేవాడు. మంగళవారం ఉదయం మురళీ చనిపోయాడని స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిబంధనలు పాటించాలి

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ కృషి చేయాలని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్నకుమార్ అన్నారు. సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ వద్ద ప్రయాణికులు, వాహనదారులకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై మంగళవారం అవగాహన కల్పించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ వినయ్‌సాగర్, ఏఎస్ఐ ఉమేష్ పాల్గొన్నారు.



యువర్ అటెన్షన్ ప్లీజ్

- 18 ఏళ్లు నిండిన వారు అర్హులు
- ఏప్రిల్ ఒకటి వరకు దరఖాస్తులు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం
- కళాశాలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు

ఓటు నమోదుకు మరో అవకాశం



పార్లమెంట్ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు యువత ఓటు నమోదు చేసుకునేందుకు మరోసారి అవకాశం కల్పించారు. 2024 ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. లోక్ సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శాతం తగ్గిన నేపథ్యంలో ఈసారి ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు.

– సంగారెడ్డి టౌన్

భారత ఎన్నికల సంఘం దేశంలోని అర్హులైన పౌరులందరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. అంతేకాక ఓటర్ల భాగస్వామ్యం పెంచేందుకు వారి బాధ్యతలు గుర్తు చేస్తూ కొత్తగా ఓటర్ల నమోదు, జాబితా సవరణ, గుర్తింపు కార్డుల పంపిణీని నిరంతరం చేపడుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండు పార్లమెంట్ నియోజకవర్గం, పది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 25,88,565 ఓటర్లు ఉండగా, అత్యధికంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో, అత్యల్పంగా మెదక్ నియోజకవర్గంలో ఉన్నట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి.

యంత్రాంగం సన్నద్ధం..

లోక్ సభ ఎన్నికలకు రాజకీయ పార్టీలు, అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో అందోల్, నారాయణఖేడ్, జహీరాబాద్, మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, సంగారెడ్డి, పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. ప్రస్తుతం లక్షల్లో ఓటర్లు ఉన్నారు. వచ్చే ఏప్రిల్‌లో లోక్ సభకు ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు నమోదుకు మరో అవకాశం కల్పించింది.

అవగాహన కార్యక్రమాలు..

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అన్ని డిగ్రీ కళాశాలల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి అక్కడికక్కడే ఓటు నమోదు నిర్వహించాలని సూచించారు. కళాశాలల్లోనే కాకుండా గ్రామాల్లోనూ ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండే యువత ఉంటారు. బూత్ స్థాయి అధికారులు దృష్టి సారిస్తే ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుందని అధికారులకు దిశానిర్దేశం చేశారు..



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ క్రాంతి

ఫారం 6 ద్వారా నమోదు..

జిల్లాలో ఇప్పటికే పార్లమెంటు ఎన్నికలకు తుది జాబితా ఈ నెల 8న విడుదల చేశారు. ఏప్రిల్ 1వ తేదీ నాటికి ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ వయోజనుడిని ఓటరు ఈ జాబితాలో చేర్చుతారు. ప్రస్తుతం విడుదలైన తుది జాబితాకు అదనంగా కొత్త అనుబంధ జాబితాను విడుదల చేస్తారు. ఓటర్ జాబితాలో పేరు ఉందా లేదా అనేది తెలుసుకోవాలని అధికార యంత్రాంగం ఓటర్లకు సూచించింది. ఫారం 6 ద్వారా నూతన ఓటరు నమోదు చేసుకోవచ్చు. ఆయా పోలింగ్ కేంద్రాల ఉండే బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) లేదంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఉమ్మడి మెదక్ జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితా

నియోజకర్గం	పురుషులు	మహిళలు
సంగారెడ్డి	1,22,021	1,25,284
పటాన్ చెరు	2,09,757	1,97,577
అందోల్	1,22,026	1,27,364
నారాయణఖేడ్	1,18,064	1,17,498
జహీరాబాద్	1,36,569	1,36,391
మెదక్	1,03,654	1,13,089
గజ్వేల్	1,37,630	1,41,854
సిద్దిపేట	1,16,042	1,20,361
దుబ్బాక	96,867	1,20,369
నర్సాపూర్	1,09,806	1,16,342

దొంగల ముఠా అరెస్ట్

- వెంచర్లలో విద్యుత్ వైర్లు దొంగతనం
- అనంతరం స్క్రాప్ దుకాణాల్లో అమ్మకం
- వాహనాలు, రూ.3.32 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ బాలాజీ

కొండపాక(గజ్వేల్): విద్యుత్ వైర్లను దొంగిలించే అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ ఏసీపీ బాలాజీ పేర్కొన్నారు. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం తొగుట సీఐ లతీఫ్‌తో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. సిద్దిపేట జిల్లా కొండాపూర్ గ్రామానికి చెందిన గుగులోతు చంద్రశేఖర్, కరీంనగర్ జిల్లా కేశవపట్నంకు చెందిన ఆగుళ్ల శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన కడారి జలేందర్ కొన్నేళ్లుగా జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నారు. మొదటగా గుగులోతు చంద్రశేఖర్ నూతనంగా నిర్మించే ఇళ్లలో కరెంట్ ఫిట్టింగ్ పనులు చేస్తుండేవాడు. వచ్చే డబ్బులు సరిపోక వెంచర్లలో విద్యుత్ వైర్లను దొంగతనం చేసి అమ్ముకునేవాడు. దీనికి స్నేహితులైన ఆగుళ్ల శ్రీనివాస్, కడారి జలేందర్‌లను జత చేసుకున్నాడు. ఈ క్రమంలో ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డు వద్ద ఓ వెంచరులో, రింగ్ రోడ్ వెంబడి ఉన్న స్తంభాలపై విద్యుత్ వైర్లు కట్ చేసి ప్రజ్ఞాపూర్‌లోని వెంకటేశ్ స్క్రాపు దుకాణంలో అమ్ముకునేవారు. అలాగే, కొండపాక మండలంలోని వెలికట్ట శివారులో ఉన్న రెండు వెంచర్లలో, కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం, మేదినీపూర్ గ్రామ దారిలోని వెంచర్లలో విద్యుత్ వైర్లను ఎత్తుకెళ్లి సిద్దిపేటలో స్క్రాప్ దుకాణదారుడు మునీషింగ్‌కు అమ్మేశారు.

పోలీసులను చూసి పారిపోతుండగా..

వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తి శివారులోని ఓ వెంచర్‌లో, కరీంనగర్ జిల్లా మానకొండూర్ శివారులోని ఓ వెంచర్‌లో విద్యుత్ వైర్లను ఆటోలో వేసుకొని ప్రజ్ఞాపూర్‌లో విక్రయించడానికి మంగళవారం వెళ్తున్నారు. ఇదే సమయంలో వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై శ్రీనివాస్‌లతోపాటు పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా దొంగలు పోలీసులను చూసి ఆటోను మరో దారిలోకి మళ్లించే ప్రయత్నం చేశారు. అనుమానంతో వెంబడించి పట్టుకోగా చేసిన దొంగతనాలు అన్నీ ఒప్పుకున్నారు. ఇప్పటికే ముగ్గురిపై వివిధ జిల్లాలో 7 విద్యుత్ వైర్ల దొంగతనాల కేసులు నమోదైనట్లు తెలిసింది. వెంటనే వారిని అరెస్ట్ చేసి ఓ టాటా ఏసీ ఆటో, బైక్, సుమారు రూ.3.32 లక్షల 1280 కిలోల అల్యూమినియం విద్యుత్ వైర్లు, మూడు సెల్‌ఫోన్లు, స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ బాలాజీ తెలిపారు. అలాగే విద్యుత్ వైర్లను కొనుగోలు చేసిన స్క్రాప్ దుకాణదారులు వెంకటేశ్, మునీషింగ్‌లపై కేసులు నమోదు చేశామన్నారు. దొంగలను పట్టుకునేందుకు చాకచక్యంగా వ్యవహరించిన సీఐ లతీఫ్, ఎస్సై శ్రీనివాస్‌లతోపాటు పోలీసులు రమణమూర్తి, యాదగిరి, రమేశ్, రాజు, కరుణాకర్‌ను ఏసీపీ బాలాజీ ప్రత్యేకంగా అభినందించారు.



నిందితులను చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ బాలాజీ

గ్రామ చిత్రం.. ముగ్గు రూపం

- సమస్యలు సైతం పటం ద్వారా ప్రదర్శన
- 'భాగస్వామ్య గ్రామీణ అంచనా' కార్యక్రమం

జహీరాబాద్: మండలంలోని రంజోల్ గ్రామంలో మంగళవారం కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థినులు 'భాగస్వామ్య గ్రామీణ అంచనా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు గ్రామ చిత్రపటాన్ని ముగ్గు రూపంలో చిత్రించారు. గ్రామం రూపు రేఖలు, ప్రజలకు ఉపయోగపడే వివిధ శాఖల కార్యాలయాలు, మందిరాలు వేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను సైతం ఈ సందర్భంగా పటం ద్వారా గుర్తించి ప్రదర్శించారు. విద్యార్థినులు మూడు నెలల పాటు గ్రామంలో ఉండి వ్యవసాయంలో రైతులు చేపట్టే వివిధ యాజమాన్య పద్ధతులు, సాగు మెలకువలు నేర్చుకోనున్నారు. ఏఈఓ ప్రదీప్‌కుమార్ పర్యవేక్షణలో జహీరాబాద్ ప్రాంతంలో సాగు చేయబడిన నూతన పంటలైన జరేనియం, చియా, యాపిల్ బేర్ తదితర పంటలను సందర్శించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీఏ భిక్షపతి, విద్యార్థినులు సజ్జ, పూజిత, సంకీర్తన, సాహితీ, రుచిత, రోషిని, సంతోషి, రైతులు మాధవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్ రెడ్డి, మోనేశ్, భాస్కర్ పాల్గొన్నారు.



గ్రామ రూపు రేఖలను పటం రూపంలో ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

భరోసా కేంద్రం సేవలు అభినందనీయం

యూనిసెఫ్ ఢిల్లీ బృందం సభ్యులు

సంగారెడ్డి: సంగారెడ్డిలోని భరోసా కేంద్రం సేవలు అభినందనీయమని యూనిసెఫ్ ఢిల్లీ బృందం జైరస్ లిగూ, డాక్టర్ జెలాలెం బి.టాఫెస్సే అన్నారు. మంగళవారం వారు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గతంలో భరోసా నోడల్ అధికారిగా వ్యవహరించిన అదనపు ఎస్పీ డా.పీ అశోక్ జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన పోక్సో, అత్యాచార కేసుల్లో భరోసా సిబ్బంది అందించిన సేవలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. బాల నేరస్తులు, మైనర్ల కేసులు పోలీసు స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి సహాయార్థమై 'చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్' పేరుతో జిల్లాలో మొదటిసారిగా సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌తో 'చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్' ప్రారంభించామన్నారు. అనంతరం యూనిసెఫ్ బృందం జైరస్ లిగూ మాట్లాడుతూ.. అన్ని రకాల సేవలను ఒకే గొడుగు కిందకి తీసుకురావడం హర్షణీయమని అన్నారు. బాధితులకు అన్ని తానై, కేసు నమోదు మొదలుకొని వారికి న్యాయం జరిగే విధంగా, బాధిత మహిళలకు నష్ట పరిహారం ఇప్పించడం వంటి సేవలు చేయడంపై భరోసా సెంటర్‌ను అభినందించారు. కార్యక్రమంలో యూనిసెఫ్ బృందంతోపాటు భరోసా సెంటర్ నోడల్ అధికారి, అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావు, డాక్టర్ జ్యోతి, భరోసా ఇన్‌చార్జి ఎస్ఐ.నాగలక్ష్మి, కో–ఆర్డినేటర్ దేవలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.



భరోసా కేంద్రంలో యూనిసెఫ్ బృందం, పోలీసులు

క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని..

- సైబర్ మోసానికి పాల్పడ్డ కేటుగాళ్లు
- రూ.54,563 పోగొట్టుకున్న బాధితులు

సిద్దిపేటకమాన్: బ్యాంకు క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని, ఫ్లిప్ కార్టు ఓచర్ వచ్చిందని మెసేజ్‌లు పంపిస్తూ అమాయక ప్రజల నుంచి డబ్బులు దోచుకుంటున్నారు. కమిషనరేట్ పరిధిలో ఇద్దరు బాధితులు గుర్తు తెలియని వ్యక్తులకు రూ.54,563 పంపి మోసపోయారు. సీపీ అనురాధ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని గుర్తు తెలియని వ్యక్తి లింకు పంపించాడు. ఆ లింకును ఓపెన్ చేసి తన వివరాలతో పాటు, ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నంబర్ నమోదు చేయగానే తన ఖాతా నుంచి రూ.28,363 డెబిట్ అయ్యాయి. దీంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. అలాగే, ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ ఫోన్‌కు ఫ్లిప్ కార్టు ఓచర్ వచ్చిందని, క్రెడిట్ ద్వారా రిలీజ్ చేసుకోవచ్చని తెలిపాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు క్రెడిట్ కార్డు వివరాలు గుర్తు తెలియని వ్యక్తికి పంపించగానే అతడి ఖాతా నుంచి రూ.26,200 డెబిట్ అయినట్లుగా మెసేజ్ వచ్చింది. వెంటనే బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

16 మందికి జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, బీజేఆర్ చౌరస్తాతోపాటు పలు చోట్ల సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. 16 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. మంగళవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన జడ్జి శ్రావణి వారికి రూ.13,500 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



వెంకటేశం (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కోనాయపల్లి(పీటీ) గ్రామానికి చెందిన దుర్గం వెంకటేశ్ గౌడ్ (48) ఆర్థిక ఇబ్బందులతో కొద్ది రోజులుగా భార్య పద్మతో కలిసి మండలంలోని దండుపల్లిలో అద్దెకుంటూ స్థానిక పరిశ్రమలో పని చేస్తున్నాడు.ఈ క్రమంలోనే మద్యానికి బానిస కావడంతో భార్య తల్లిగారింటికి వెళ్లింది. వెంకటేశ్ గౌడ్ సోమవారం రాత్రి దండుపల్లి శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసు కున్నాడు. మంగళవారం మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొండపాక(గజ్వేల్): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్లా జిల్లా తంగెళ్లపల్లికి చెందిన పరశురాములు (28) కూలీ పనులు చేసుకుంటూ చిట్టీల వ్యాపారం చేసేవాడు. వ్యాపారంలో నష్టం రావడంతో అప్పులు పెరిగిపోయాయి. సుమారు 4 ఏళ్ల పాటు దుబాయ్ వెళ్లి కొన్ని అప్పులు తీర్చగా మరిన్ని మిగిలిపోయాయి. వాటిని తీర్చేమార్గం కానరాక మదనపడుతుండేవాడు. ఈ నెల 23వ తేదీన తిరుపతి వెళ్తున్నానంటూ ఇంట్లో చెప్పి వెళ్లాడు. మంగళవారం కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. మృతుడి వద్ద దొరికిన ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ల వివరాలు తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్సు అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-12 52668]

WANTED

■హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ: 18k ఫోన్: 9640258899 / 9640468899 [H-793696]

■ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9059663584. [M-1233857]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గుప్పుమంటున్న గంజాయి

- గ్రామాల్లో విచ్చలవిడిగా సాగుతున్న దందా
- బానిసలవుతున్న యువత
- కరీంనగర్ టూ కొండాపూర్‌కు సరఫరా
- పట్టించుకోని అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): గంజాయి దందా జోరుగా సాగుతోంది. గంజాయి మత్తుకు అలవాటు పడిన యువత చిత్తవుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి నేరుగా దూల్మిట్ట మండలంలోని కొండాపూర్ గ్రామంలో గంజాయి సరఫరా చేస్తున్నారని సమాచారం. అక్కన్నపేట మండలం రామవరం గ్రామానికి అనుకొని ఉంటుంది. దీంతో మండలంలోని రామవరం, గండిపల్లి, కుందనవానిపల్లి, అక్కన్నపేట, కేశనాయక్‌తండా, గౌరవెల్లి గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల్లోని యువత, విద్యార్థులు గంజాయి మత్తుకు బానిసలవుతున్నారు.

ఒక్క ప్యాకెట్ రూ.350 పైనే

గ్రామాల్లో యువత ఎక్కువగా చెరువు కట్లపై, రహస్య ప్రదేశాల్లో సిగరేట్లలో తంబాకును తొలగించి గంజాయి మిశ్రమాన్ని కలిపి తాగుతున్నారు. ఒక గంజాయి ప్యాకెట్ సుమారుగా రూ.350 నుంచి రూ.500వరకు లభిస్తున్నట్లు సమాచారం. ఒక ప్యాకెట్ ద్వారా మూడు, నాలుగు సిగరెట్లు తాగవచ్చని చెబుతున్నారు. అయితే గంజాయికి అలవాటు పడుతున్న వారిలో యువకులతో పాటు పాఠశాలల్లో చదివే విద్యార్థులు సైతం ఉంటున్నారు. ఒకరిని చూసి ఒకరు అలవాటు చేసుకుంటూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. సాయంత్రం వేళ్లలో గ్రామాల్లో యువకులు గ్రూపులుగా ఏర్పడి గంజాయి సేవిస్తున్నారని సమాచారం.

పండుగ రోజుల్లో జోరుగా....

రామవరం గ్రామంలో సాధారణంగా దసరా, సంక్రాంతి వంటి పెద్ద పండుగలు వచ్చాయంటే చాలు గంజాయి గుప్పుమంటోంది. ఈ గ్రామంలోని యువకులు హైదరాబాద్ లాంటి పెద్ద నగరాల్లో ఉంటారు. పండుగలకు గ్రామానికి వచ్చినప్పుడల్లా గంజాయి తాగుతారని పలువురు బాహాటంగానే చెబుతున్నారు. గతంలో బొడిగెపల్లి స్టేజి వద్ద ఇద్దరు యువకులు మత్తులో బ్లేడ్లతో గొంతు కోసుకున్నారు. అలాగే, మండలంలోని అంతక్కపేట గ్రామంలో ఓ ఇంటి ఆవరణంలో గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటనలు ఉన్నాయి. గంజాయి నివారణపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



సమాచారం ఇవ్వాలి



గంజాయి విక్రయమే కాదు.. వినియోగించినా శిక్షార్హులే. గంజాయిని విక్రయించే వారినే నిఘా పెడుతున్నాం. పల్లెల్లో ఎప్పటికప్పుడూ ఆరా తీస్తున్నాం. గంజాయి గురించి ఎవరైనా సమాచారం ఇస్తే వారి వివరాలను రహస్యంగా ఉంచుతాం. ఎక్సైజ్, పోలీసులకు సహకరించి విక్రయదారుల వివరాలను అందించాలి. ఎవరైనా పట్టుబడితే మాదక ద్రవ్య వినియోగ చట్టం ప్రకారం చర్యలు చేపడుతాం.

–సీహెచ్. పవన్, ఎక్సైజ్ సీఐ, హుస్నాబాద్

బంగారం అపహరణ

తూప్రాన్: ప్రయాణికురాలి బ్యాగులోని బంగారు ఆభరణాలు అపహరణకు గురైన ఘటన తూప్రాన్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఈఎస్ఐలో నివాసం ఉంటున్న ఉప్పల శ్వేత 26వ తేదీన తూప్రాన్‌లో బంధువుల ఇంటికి ఓ శుభకార్యానికి వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం తిరిగి సొంతింటికి వెళ్లేందుకు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రాణిగంజ్ డిపో బస్సు ఎక్కింది. పట్టణ సమీపంలోని టోల్‌ప్లాజా సమీపంలోకి చేరుకున్న తర్వాత తన బ్యాగ్ తెరిచి చూడగా అందులోని 12.5 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. బాధితురాలు శ్వేత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టపగలే ఇంటిలో..

శివ్వంపేట(నర్సాపూర్): పట్టపగలే ఇంటి తాళాలు పగులగొట్టి బంగారం చోరీకి పాల్పడిన ఘటన మండల పరిధి గోమారం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంగిరెడ్డి మల్లారెడ్డి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం పని నిమిత్తం పొలం వద్దకు వెళ్లారు. రాత్రి ఇంటికొచ్చిన మల్లారెడ్డి కుటుంబ సభ్యులు తాళం పగులగొట్టి ఉండడాన్ని గుర్తించి లోనికి వెళ్లి చూశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని రూ.50 వేల నగదు, 11 తులాల బంగారం చోరీ చేసినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ మృతి

జిన్నారం(పటాన్‌చెరు): విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలో మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం.. పశ్చిమబెంగాల్‌లోని బీర్‌భమ్ జిల్లాలోని కాటగరియా గ్రామానికి చెందిన వసీం అక్రమ్ (30) గండి మైసమ్మలో లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అన్నారంలోని ఎస్‌బీకే ఇటుక బట్టీకి అవసరయ్యే బూడిదను అక్రమ్ లారీలో తీసుకొచ్చాడు. లారీలోని బూడిదను అన్‌లోడ్ చేసే క్రమంలో లారీపైకి ఎక్కిన అక్రమ్ పైన ఉన్న విద్యుత్ వైర్లను చూసుకోకపోవడంతో కరెంట్ షాక్ కొట్టింది. దీంతో అక్రమ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బావ ముర్తుజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.